# అర్ధనారీశ్వరుడు

ఆఫీసుల్లో బదిలీల పర్వం కొత్త విషయమేమీ కాదు.

పాతనీరు పోయి కొత్తనీరు వచ్చినట్లుగా, పాత ఆఫీసర్లస్థానే కొత్త ఆఫీసర్లు వస్తుంటారు.

అదుగో – అలా వచ్చిన ఆఫీసర్ ఆనంద రావు.

మనిషి అయిదడుగులు. బట్టతల! టెన్నిస్ బనియన్ మీద టక్. కాళ్లకి బరువైన బూట్లు. ఆ బూట్ల బరువే లేకపోతే మనిషి బ్యాలెన్సు సరిగా ఉండేది కాదేమో! అనుమానం చూపులు. శరాఖాతాల్లాంటి వాక్కులు.

వాక్కులు – ఈ వాక్కుల దగ్గరే మన కథ ప్రారంభం అవుతుంది.

ఆనందరావు వాక్కువిని – అంటే గొంతు విని, ఆఫీసులో అందరం ఉలిక్కిపడ్డాం.

కారణం – అది స్త్రీ స్వరం!

అందరిలోకి నేనే సీనియర్ కావటం వల్ల నన్ను సహోద్యోగులు గౌరవంగా 'గురువుగారూ' అని పిలుస్తుంటారు.

ఆనవాయితీ ప్రకారం 'స్టాఫ్ మీటింగు' జరిగింది.

స్టాఫు తరపున నేను మాట్లాడాను.

కొత్త ఆఫీసరుకి స్వాగతం చెబుతూ, ఎలాం టి ఆధిక్యతా భావాలూ చూపకుండా, ఏక కుటుంబ భావనతో అందరూ కలిసిమెలిసి పని చేయటం వల్ల ప్రోజెక్టు లక్ష్యాలు నెరవేరతాయని నొక్కి చెప్పాను.

ఆనందరావు అయిదడుగుల ఎత్తే ఉన్నా హోదా అతన్ని మానసికంగా మరో అడుగు ఎత్తుపెంచింది. అతను అరడుగుల ఎత్తుగా నడుస్తున్నట్లు ఫీలవుతుంటాడు. దీన్నే ఇంగ్లీషు లో Walking Tall అంటారు. అందుకే అతనికి ముందుగానే హెచ్చరిక చేసాను.

ఆనందరావు ఇంగ్లీషులో మాట్లాడేడు.

మాధుర్యంలేని స్త్రీ స్వరం.

వాగాడంబరం.

తన సర్వీసు, అనుభవం, తనకు లభించిన ప్రసంశలు అన్నీ ఏకరువు పెట్టాడు. సర్వీసు రూల్సన్నీ కాచివడపోసాను. కాబట్టి, ఎక్కడా పొరబాటు జరగనివ్వను – అని శపథం కూడా చేసాడు.

చేయటమే కాదు, ఆ మర్నాటి నుంచీ కదిల్తే రూలు, మెదిల్తే రూలు చొప్పున ఊపిరాడకుండా రూల్సు ఏకరువు పెట్టాడు. ఫైల్సు ఎక్కడివక్కడ అరెస్టయిపోయి, కాగితాలు వణకసాగాయి. అందరూ కుర్చీలకి అంటుకుపోయి 'కింకర్త వ్యం' అన్నట్లు ఒకరిమొహాలు ఒకరు చూసుకుం టుండిపోయారు.

నేను పరిస్థితిని గమనించి, లైబ్రరీలోంచి సర్వీసు రూల్సు పుస్తకాలన్నీ తీసుకుని ఇంటికి చేరాను. పెందరాడే భోజనం చేసి, తెల్లవార్లూ క్షుణ్ణంగా అన్నీ చదివాను. రూల్సుకి ఎమెండ్

కేఆర్టీ

మెంట్స్, ఎక్స్‌ప్రెషన్స్, డిస్క్రిమినేటివ్ పవర్సు వంటివి ప్రత్యేకంగా డైరీలో రాసుకున్నాను.

ఓ గంట కునుకు తీసి, చక్కగా తలస్నానం చేసి ఆఫీసుకు సకాలంలో చేరాను.

ఆనందరావు అప్పటికే అటెండెన్స్ రిజిస్టరు తన దగ్గరకి తెప్పించుకున్నాడు. నాదే మొదటి సంతకం. నా వెనుకే ఒక్కొక్కళ్లూ వచ్చారు. అలవాటుగా జూనియర్ అసిస్టెంటు ఎర్రబాబు అరగంట ఆలస్యంగా వచ్చాడు.

సంతకం చేస్తుండగా "ఫస్టు వార్నింగ్! రేపట్నుంచీ టైముకి రావాలి..." అన్నాడు. ఆ తర్వాత తన రూమ్‌లోకి వెళ్లిపోయాడు.



ఆ తర్వాత అంతా పనులు ప్రారంభించాం.

యుద్ధానికి ముందుగా నేనే సిద్ధపడి, ఫైలు లోపలికి తీసుకెళ్లాను. అనుకున్నట్లే ఆ ఫైలు మీద మా యిద్దరికీ 'రూల్సు' యుద్ధం జరిగింది. దెబ్బ మీద దెబ్బకొట్టి 'దీన్' అనిపించి విజయ గర్వంతో బయటకు వచ్చాను.

అలా మొదలయిన మా యుద్ధం రోజూ కొనసాగుతూనే ఉంది. అందరం 'వర్క్ టు రూల్'గా పనిచేయసాగాం. దానివల్ల మా ఆఫీసుతో పని ఉన్నవాళ్ళు అనేక ఇబ్బందుల పాలయ్యారు. ఆఫీసులో రూల్సు గురించి వాదనలు, అరుపులు కేకలతో వాతావరణం భీభత్సంగా తయారయ్యింది. ఇది మాకు బాధగానే ఉంది. కానీ ఆనందరావుకి గుణపాఠం నేర్పడానికి మరో మార్గం కనపడలేదు.

మా గొడవల గురించి పై అధికార్లకు తెలిసి, హఠాత్తుగా ఇన్‌స్పెక్షన్ కొచ్చి నాలుగు రోజుల్లో వాతావరణాన్ని పరిశీలించి వెళ్లారు. ఫలితంగా కొందరికి బదిలీలు వచ్చాయి.

ఆనందరావు విజయోత్సాహంతో సగర్వంగా ప్రవర్తించసాగేడు. అయితే బదిలీ మీద మా ఆఫీసుకు వచ్చినవాళ్ళు బాగా సీనియర్లు. పనితో బాటు, పై ఆఫీసరు పని పట్టడంలో ఘనులు. దీనితో ఆనందరావు ఆటకట్టయింది.

ఇంకేమీ చేయలేక గోరంత తప్పులకి కొండంత మెమోలు ఇవ్వసాగాడు. దానికి జవాబుగా గోళ్లకు బదులు గొడ్డళ్లు వాడినట్లు సమాధానాలు యివ్వసాగారు.

దీనితో ఆనందరావు బాలెన్సు పూర్తిగా పోయి, ప్రతి దానికి అరవటం, కరవటంలాగా ప్రవర్తించసాగేడు. ముఖ్యంగా దీనివల్ల ప్యూన్లకి ఇబ్బంది పెరిగింది. వాళ్లకి మనశ్శాంతి కరువై చీటికీ మాటికీ శలవులు పెట్టసాగారు. ఆనందరావుకి వళ్లుమండి వాళ్లని కూడా బదిలీ చేయించాడు.

కొత్తగా వచ్చిన ప్యూన్లలో అల్లాబక్షీ మహా ముదురని ప్రసిద్ధి. అప్పుపట్టటంలో వాడు ఆరితేరిన ఘటం. ఎవరో ఒకరి చేత రోజూ చికెన్ బిర్యాని స్పాన్సర్ చేయించుకుంటేగానీ శాంతించడు. మాట తేనెకంటే తియ్యనిది. మనిషిని క్షణంలో ఐస్ చేసేస్తాడు. ఒక్క నా జోలికి మాత్రం రాలేదు. అది నా అదృష్టం.

అల్లాబక్షీతో బాటు జనరంజని అనే ఆడ ప్యూను వచ్చింది. ఆవిడ చలంపాత్రల్లో ఒక పాత్ర లాంటిది. దుర్వాసుడిలా పేరు పొందిన ఆనందరావుని అయిదు నిమిషాల్లో లైనులో పెట్టేసింది. ఇప్పుడు అందరి ప్రాణమూ హాయిగా ఉంది.

ఆఫీసు ప్రశాంతంగా ఉంది.

అయితే జరగరానిది జరిగిపోయింది. అదేమిటంటే – అల్లాబక్షీకి, జనరంజనికీ అప్పు విషయంలో మాట తేడా వచ్చింది. దాంతో అల్లాబక్షీ ఆనందరావు భార్యకి ఆఫీసు విషయాలన్నీ మోసేసాడు. (ఆనందరావుకి ఆవిడంటే హడలని తర్వాత తెలిసింది!)

ఓ దుర్ముహూర్తాన ఆనందరావు భార్య ఆఫీసు కొచ్చేసింది. నేరుగా ఆనందరావు గదిలోకి వెళ్లింది. ఆ సమయంలో జనరంజని ఆయన గదిలోనే ఉంది. వెళ్లిన కొద్ది నిమిషాలకి జనరంజని బయటకొచ్చింది. వెంట ఆనందరావు భార్య – అంటే అర్ధాంగి!

"ఎవర్నన్నా డాక్టర్ని పిలవండి ఆయన పడిపోయారు" అంది ఆనందరావుగారి అర్ధాంగి. ఆ గొంతు విన్నాక మూర్ఛవచ్చినంత పనయింది. ఆవిడది సాక్షాత్తూ మగగొంతు! అది కూడా కొరడా ఝుళిపించినంత కరుగ్గా ఉంది. ●